వైఎస్ఆర్
# కడప వార్త
తెలుగు జాతీయ దినపత్రిక
మంగళవారం 02 జూన్ 2026



## ఐఐటీ అడ్వాన్స్‌డ్‌లో ఆల్ ఇండియా 23వ ర్యాంక్ సాధించిన హేమంత్ కుమార్ రెడ్డి



**బద్వేల్, జూన్ 1, ప్రభాతవార్త:**
ఐఐటీజేఈఈ అడ్వాన్స్‌డ్ 2026 ఫలితాల్లో ఓపెన్ క్యాటగిరిలో బద్వేల్ కు చెందిన హేమంత్ రెడ్డి ఆల్ ఇండియా 23వ ర్యాంకు సాధించారు. బద్వేల్ పట్టణం, సురేంద్రనగర్ కు చెందిన ఉపాధ్యాయుడు విజయ భాస్కర్ రెడ్డి కుమారుడు హేమంత్ రెడ్డిని రాష్ట్ర నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎం. రవిశంకర్ ,పలువురు పట్టణవాసులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హేమంత్ కుమార్ రెడ్డి సాధించిన ఈ ఘన విజయం ఆయన కఠోర శ్రమ, అంకితభావం, పట్టుదలకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ విజయంతో ఆయన కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, స్నేహితులు మాత్రమే కాకుండా సమాజం మొత్తం గర్వపడేలా చేశారని అన్నారు. అలాగే హేమంత్ తండ్రి విజయభాస్కర్ రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలియజేసిన రవిశంకర్, విద్యార్థి సాధించిన ఈ అరుదైన ఘనత యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆల్ ఇండియా స్థాయిలో 23వ ర్యాంక్ సాధించిన హేమంత్ కుమార్ రెడ్డి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## దువ్వూరులో బడి పండుగ

**దువ్వూరు, జూన్ 01, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన దువ్వూరులో మండల విద్యాశాఖ అధికారులు రమణయ్య, భాస్కర్ ల ఆధ్వర్యంలో సోమవారం బడి పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దువ్వూరులోని హరిజనవాడ, క్రిస్టియన్ క్వార్టర్స్, ఉర్దూ పాఠశాల, ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ హైస్కూల్ కి వచ్చిన ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని ర్యాలీ నిర్వహించారు. బడి ఈడుకు వచ్చిన పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదవాలని, చదివితే మంచి సౌకర్యాలు ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆవుల శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.




ప్రభుత్వ కార్యాలయాల్లో
# ఈఆఫీస్ వినియోగం తప్పనిసరి

భౌతిక ఫైళ్లకు ఇకపై తావులేదు : కఠిన ఆదేశాలు జారీ చేసిన జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి

ఫైళ్ల పరిష్కారంలో జాప్యంపై జిల్లా కలెక్టర్





**కడప, జూన్ 01 ప్రభాతవార్త :**
డిజిటల్ గవర్నెన్స్ లో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల నిర్వహణ కేవలం ఈఆఫీస్ ద్వారానే తప్పనిసరిగా జరగాలని, భౌతిక ఫైళ్లను వినియోగించడం నిబంధనలకు విరుద్ధమని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని సభా భవన్ సమావేశపు హాలు నందు.. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తో పాటు డిఆర్ఓ మల్లికార్జునుడు,వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం అధికారుల సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి అధికారి ఈ ఆఫీసు ద్వారా ఫైల్స్ పంపాలని గత ఆరు నెలలుగా ఆదేశాలు ఉన్నప్పటికీ,కొన్ని కార్యాలయాల్లో అంతర్గత ఫైళ్లను ఇంకా భౌతికంగానే నడుపుతున్నారని, ఇది క్రమశిక్షణారాహిత్యమే కాకుండా చట్టవిరుద్ధమని ఆయన హెచ్చరిస్తూ, ప్రతి కార్యాలయం నుండి ఈ ఆఫీసు ద్వారా ఫైల్స్ పంపాలని ఆదేశించారు.ప్రతి అధికారి తమ లాగిన్ లోకి వచ్చిన ఫైల్‌ను గరిష్టంగా రెండు రోజుల్లోపు పరిష్కరించాలని, జాప్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.జిల్లావ్యాప్తంగా ఆడిట్ బృందాలతో తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తోందన్నారు. ఈవేదిక ద్వారా అందే అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వం వీడి ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనిచేయాలని, అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలనన్నారు. ముఖ్యంగా వేసవిలో ప్రజల వ్యయ ప్రయాసలను దృష్టిలో ఉంచుకుని క్షేత్ర స్థాయిలోనే ప్రజల సమస్యలను స్థానికం గానే గుర్తించి మండల స్థాయిలోనే పరిష్కరించేలా జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. పిజిఆర్ఎస్ లో రీ ఓపెన్ అయిన అర్జీలను మరింత నాణ్యతతో పరిష్కరించాలని, జిల్లా అధికారులకు అందిన అర్జీలను పరిష్కరించేందుకు సమయం కేటాయించి సమీక్ష చేయాలన్నారు.. అలాగే అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏ లేకుండా చూడాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు.

దేశంలోనే పింఛన్ల కోసం
## ఎక్కువ నిధులు ఖర్చు చేసే రాష్ట్రం ఆంధ్ర

టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు



నూనె వారి పల్లెలో పింఛన్ అందజేస్తున్న జగన్ రాజు, శివ తదితరులు

**రాజంపేట, జూన్1 ప్రభాతవార్త**
దేశంలోని పేదలకు సామాజిక పింఛన్ల కోసం ఎక్కువ నిధులు కేటాయించే రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు అన్నారు. సోమవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో రాజంపేట మున్సిపాలిటీ పరిధిలోని నూనె వారిపల్లె ఈడిగ పాలెం, ఇంకా పలు వార్డులలో పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. పింఛన్ల పంపిణీ ఎలా ఉందని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూకూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టినాటికి 6000 కోట్లు లోటు బడ్జెట్ వున్నా ప్రజల ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని సూపర్ సిక్స్ పథకాల అమలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరిని ఆదుకుంటుందని చమర్తి తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు దగ్గుపాటి సుబ్రహ్మణ్యం నాయుడు, పార్లమెంట్ అధికార ప్రతినిధి దొంతం శివప్రసాద్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంగల్ రాయుడు, క్లస్టర్ ఇంచార్జ కొల్లి రెడ్డయ్య నాయుడు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తుపాకుల అశోక్,కౌన్సిలర్ రాజేష్, డాక్టర్ నవీన్ చంద్ర,మాజీ కౌన్సిలర్ మనుబోలు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పొగాకుకు దూరంగా ఉండాలి..
# ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ

**పులివెందుల, జూన్ 1 , ప్రభాతవార్త :**
పొగాకు పదార్థాల వినియోగం అనేక ప్రాణాంతక వ్యాధులకు కారణమవుతుందని, ప్రజలు పొగాకు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని నగరిగుట్ట, బాకారాపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు డాక్టర్ స్నేహ ప్రత్యూష, డాక్టర్ శాంతకుమార్ సూచించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పులివెందుల ప్రాంత ప్రభుత్వ పొగాకు నివారణ విభాగం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాత ప్రాంతీయ ఆసుపత్రి నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీని డాక్టర్ స్నేహ ప్రత్యూష, డాక్టర్ శాంతకుమార్, పొగాకు నివారణ విభాగం కౌన్సిలర్ సుమలత జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ పొగాకు వినియోగం వల్ల క్యాన్సర్, గుండె జబ్బులు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, నోటి క్యాన్సర్ వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా యువత పొగాకు ఉత్పత్తుల పట్ల ఆకర్షితులు కాకుండా ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. పొగాకు అలవాటును మానుకోవాలనుకునే వారికి ప్రభుత్వం ప్రత్యేకంగా పొగాకు నివారణ కేంద్రాల ద్వారా కౌన్సిలింగ్ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.ర్యాలీలో పాల్గొన్న అధికారులు, వైద్య సిబ్బంది ప్రజలకు పొగాకు వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించి అవగాహన కల్పించారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ర్యాలీలో పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రజలను చైతన్యపరిచారు.ఈ కార్యక్రమంలో ఐసీటీసీ, ఎస్టీఐ, టీబీ కౌన్సిలర్లు వెంకటసుబ్బయ్య, బాదల్ వలి, భాగ్యలక్ష్మి, సబ్ యూనిట్ అధికారులు సతీష్ కుమార్, సిద్దయ్య, ఏఎన్ఎం సూపర్‌వైజర్ కృష్ణవేణి, సీడీఎస్ మేనేజర్ వల్లి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు పాల్గొన్నారు.




పొగాకు వ్యతిరేకంగా వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించిన దృశ్యం

భారీ వర్షం.. పుల్లేరు వంక పొంగిపొర్లడంతో
## రాకపోకలకు అంతరాయం



**ముద్దనూరు, జూన్ 01 ప్రభాతవార్త:**
మండలంలో సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షాల కారణంగా నల్లబల్లె గ్రామ సమీపంలోని పుల్లేరు వంక పొంగిపొర్లింది. దీంతో వంకపై నుంచి వరద నీరు ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.పుల్లేరు వంకలో వరద నీరు అధికంగా ప్రవహించడంతో పులివెందుల వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు ముందుకు వెళ్లలేక నిలిచిపోయాయి. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఈ విషయం తెలుసుకున్న ముద్దనూరు తహసీల్దార్ ఎం.డి. అలీఖాన్ మరియు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నగేష్‌బాబు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదాలు జరగకుండా వంక వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయించి, ప్రజలు వరద నీటిలోకి వెళ్లకుండా చర్యలు చేపట్టారు. అలాగే వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.వరద నీటి ప్రభావంతో దెబ్బతిన్న రహదారిని అధికారులు, సిబ్బంది చొరవ తీసుకుని తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. నీటి ప్రవాహం క్రమంగా తగ్గడంతో రహదారిని సురక్షి తంగా మార్చి వాహనాల రాకపోకలకు అనుకూలంగా తీర్చిదిద్దారు. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత రాకపోకలు యథావిధిగా పునరుద్ధరించబడ్డాయి. పోలీసులు, రెవెన్యూ అధికారులు సమన్వయంతో వ్యవహరించడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నివారించగలిగారని స్థానికులు అభినందించారు. అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

టిడిపి ఇంచార్జ్ బిటెక్ రవి



**వేంపల్లె జూన్ 01 ప్రభాతవార్త**
ప్రజా సమస్యలపై దృష్టి సారించి, వీటి పరిష్కారమే టిడిపి కూటమి ప్రధాన లక్ష్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి(బిటెక్ రవి) అన్నారు. సోమవారం మండల పరిధిలోని ముసల్ రెడ్డిగారిపల్లి గ్రామంలో మండల ఇంఛార్జ్ రఘునాథ్ రెడ్డి, కన్వీనర్ రామమునిరెడ్డి లతో కలిసి తాగునీటి బోరును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తాగు, సాగునీటి సమస్య పరిష్కారానికి తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ముసల్ రెడ్డిగారిపల్లి గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య పరిష్కారానికి బోర్ ని ఏర్పాటు చేశామన్నారు. అలాగే నిత్యం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి పరిష్కారం చేయడమే తన ధ్యేయమన్నారు. అభివృద్ధి పనుల్లో రాజీ పడకుండా నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మహమ్మద్ షబ్బీర్, తెలంగాణ వల్లి జెబి బుల్ల కుమ్మరంపల్లి రెడ్డయ్య చంద్రశేఖర్ రెడ్డి(దిల్మాంగే), రామగంగిరెడ్డి, రామాంజీరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణారెడ్డి, దక్కారమేష్, మడక శ్రీను, మాబుషరీఫ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు హిందువుల అభిప్రాయాలను తీసుకోవాలి

దేవాలయాలు,హిందువులు నివాసం ఉన్న చోట ముస్లిం స్మశాన వాటిక....!




**మైదుకూరు జూన్ 1 ప్రభాతవార్త:**
మైదుకూరు నియోజకవర్గం శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ మే నెల 28వ తేదీన బక్రీద్ సందర్భంగా ముస్లిం వర్గానికి స్మశానానికి స్థలాన్ని కేటాయిస్తూ ప్రకటన నేపథ్యంలో అభ్యంతరం చేస్తున్న వ్యవసాయ రైతులు, అక్కడ చుట్టుపక్కల హిందువుల భూములు అధిక సంఖ్యలో ఉండడం, వినాయక స్వామి, రాములవారు ఆలయం, నాగుల పుట్ట ఉండడంతో హిందువులు ఎక్కువ శాతం పండుగ సమయంలో అక్కడ సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో భక్తులు అనేక కార్యక్రమాలు చేస్తూ ఉంటారు. అందువలన ముస్లింకు కేటాయిస్తున్నారని తెలుసుకున్న చుట్టుపక్కల పరిధిలో ఉన్న రైతులు హిందువులు వ్యతిరేకిస్తూ ఈ ప్రకటన వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంలో పోరాటం చేస్తామని పలువురు తెలిపారు. బక్రీద్ సందర్భంగా మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ముస్లిం వారికి కేటాయిస్తున్న స్మశాన వాటిక స్థలం సర్వేనెంబర్ 84 ఈ నెంబర్లో 2.95 సెంట్లు వాగు పరంబోకు అని రెవెన్యూ వారు తేల్చారు. అయితే పూర్వం పాలెం చెరువు అలుగు వంక సంబంధించిన భూమి నేషనల్ హైవే వారు కూడా ఈ అలుగు నీరు పారడానికి అక్కడ బ్రిడ్జి నిర్మాణం కూడా నిర్మించారు. వర్షాలు అధిక సంఖ్యలో పడినప్పుడు ఈ వాగు నీరు కొన్ని గ్రామాల మీదుగా వెళుతుంది. భూగర్భ జలాలు పెరిగి చాలామందికి త్రాగునీరు సాగునీరు కూడా ఉపయోగాల్లో పూర్వం నుంచి ఉంది. ఇక్కడ ఇంకొక విషయం కూడా అధికారులు ఆలోచించాలి. ఇక్కడ చాలామంది వ్యవసాయ రైతులు పిత్రార్జితం అంటే పూర్వం వంశపారంపర్యంగా వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్న వారు చాలామంది ఉన్నారు. ఇలాంటివి ఎన్నో పరిగణంలోకి తీసుకోవాలి. అంతేకాకుండా ఇక్కడ గత కొన్ని సంవత్సరాలుగా వినాయక గుడి, చీరలమ్మ సమాధి, నాగుల 3 లో



## పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత

**ప్రొద్దుటూరు జూన్ 1 ప్రభాతవార్త**
జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎస్ఐఒ ప్రొద్దుటూరు మరియు పరిసర్ సంవాద్ ఆంధ్రప్రదేశ్ చాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో ఎన్విరాన్మెంట్ అవేర్నెస్ అండ్ సివిక్ సెన్స్ కాంపేన్ పేరుతో ప్రత్యేక పర్యావరణ అవగాహన కార్యక్రమాన్ని జూన్ 1 నుండి జూన్ 15 వరకు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూన్ 5న నిర్వహిస్తారని, 2026లో ఈ కార్యక్రమం వాతావరణ మార్పులపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం వెల్లడించింది. ఈ ప్రచార కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ సి. రవిచంద్ర రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొంటూ, నగరాన్ని పరిశుభ్రంగా మరియు పచ్చదనంతో నింపేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎస్ఐఒ ప్రొద్దుటూరు నగర అధ్యక్షులు బ్రదర్ రోషన్ జమీర్, రీజినల్ ఆర్గనైజర్ బ్రదర్ ఆదిల్, రీజినల్ జాయింట్ సెక్రటరీ బ్రదర్ అజాజ్ తదితరులు మరియు సంస్థ సభ్యులు పాల్గొన్నారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రతపై అవగాహన, మొక్కల నాటడం, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు చైతన్యం కల్పించడం, పౌర బాధ్యతలపై ప్రచారం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మన పర్యావరణం మన బాధ్యత చిన్న చర్యలు పెద్ద మార్పు అనే సందేశంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.





## పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు

**కలసపాడు, జూన్ 1 ప్రభాతవార్త:**
మండలంలోని చెన్నుపల్లె గ్రామపంచాయతీ పరిధిలో గల ఎస్సీ కాలనీలో గత మూడు నెలలుగా విరిగిన కరెంటు స్తంభం ప్రమాదమని తెలిసినా విద్యుత్ శాఖ అధికారులు పట్టి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామ దళితులు ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడైనా కూలిపోయి ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం, విరిగిన విద్యుత్ స్తంభం గురించి విద్యుత్ శాఖ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. సంబంధిత అధికారులు సమస్యను పట్టించు కోకపోవడంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు ఎక్కువగా తిరిగే ఈ ప్రాంతంలో ఏ క్షణానైనా పెను ప్రమాదం సంభవించవచ్చని వారు భయపడుతు న్నారు. స్తంభం పూర్తిగా వంగిపోయింది. వర్షం వస్తే పరిస్థితి మరింత దారుణమని అధికారులు వచ్చి చూసి వెళ్తున్నారు కానీ మరమ్మతులు చేయడం లేదని స్థానికులు వాపోయారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి విరిగిన విద్యుత్ స్తంభాన్ని వెంటనే మార్చాలని, భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విద్యుత్ స్తంభం ద్వారా ఎలాంటి ఇబ్బంది జరిగినా విద్యుత్ శాఖ అధికారులే బాధ్యత వహించాలని గ్రామ పంచాయతీ ప్రజలు ప్రభుత్వ అధికారులే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

# కూటమి నేతలు అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చారు : ఎమ్మెల్సీ





**ముద్దనూరు, జూన్ 01 (ప్రభాతవార్త):**

స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నేతలు ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని, కానీ రెండు సంవత్సరాలు దాటినా వాటి అమలులో విఫలమయ్యారని ఆరోపించారు. ఎన్నికలకు ముందు 19 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఆర్థిక సహాయం అందిస్తామని, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని, రైతులకు మెరుగైన మద్దతు ధరలు కల్పిస్తామని, విద్యార్థులకు పూర్తి స్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తామని, మహిళల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు అమలు చేస్తామని హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీల అమలుపై స్పష్టత లేకుండా ప్రజలను నిరాశపరిచారని విమర్శించారు.రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని ఆయన ఆరోపించారు. తెలుగుదేశం, బిజెపి, జనసేన పార్టీలు కలిసి అధికారంలోకి వచ్చినప్పటికీ ప్రజల ఆశలను నెరవేర్చడంలో విఫలమయ్యాయని పేర్కొన్నారు. ఈనెల 4వ తేదీ ముద్దనూరు 12వ తేదీ జమ్మలమడుగు నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్టు కార్యకర్తలకు తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ని రుత్సాహపడకుండా ప్రజల మధ్య ఉంటూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి మండలంలోని అన్ని స్థానాలను గెలుచుకునేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పని చేయాలని, తాను ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.ఈ సమావేశంలో ఎస్ఈసీ నెంబర్ గిరిధర్ రెడ్డి, కడప జిల్లా నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గుర్రప్ప, మండల కన్వీనర్ శ్రీధర్ రెడ్డి, పుల్లయ్య యాదవ్, మణికంఠ రెడ్డి, భాస్కర్ రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఖాదీర్ బాషా, శ్రీకాంత్ రెడ్డి, జయరాం నాయుడు, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## చట్టపరిధిలోనే అవినీతిపై ప్రభుత్వం చర్యలు

**టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వైఎస్ జబీవుల్లా**

**ప్రొద్దుటూరు జూన్ 1 ప్రభాతవార్త**



చట్టం పరిధిలోని అవినీతిపరులపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎలాంటి కక్ష సాధింపులు ఉండవని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వైయస్ జబీఉల్లా స్పష్టం చేశారు. సోమవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పీఏ కెఎన్ఆర్ సంబంధిత ఆర్థిక లావాదేవీలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, వాటిపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. గత వైసీపీ ప్రభుత్వంలో చోటుచేసుకున్న లిక్కర్ స్కామ్‌లో ఆ పార్టీ నేతలు, సన్నిహితుల పాత్రపై ఇప్పటికే ఆరోపణలు ఉన్నాయన్నారు. అలాగే డీఎస్సీ నియామకాల అంశాన్ని ప్రస్తావిస్తూ, గతంలో ఉద్యోగాల భర్తీపై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని, ఇప్పుడు జరుగుతున్న నియామక ప్రక్రియపై విమర్శలు చేయడం తగదని అన్నారు. డీఎస్సీ పరీక్ష ను అడ్డుకునేలా వైసీపీ పలు పిటిషన్లు వేసిందని కూడా ఆయన ఆరోపించారు. కూటమి ప్రభుత్వం పారదర్శక పాలనతో ముందుకు సాగుతూ ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమతుల్యంగా అందిస్తోందని తెలిపారు. టిడిపి కార్యకర్తలు ప్రతిపక్ష విమర్శలకు స్పందించి అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు.

## నిరుపేదలకు
# ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి



**పెండ్లిమర్రి, జూన్ 1, (ప్రభాతవార్త):**

పెండ్లిమర్రి మండలంలోని వెల్లటూరు గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో నాయకులు సోమవారం పెండ్లిమర్రి తహసీల్దారుకు వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా డీహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు చెన్నయ్య మాట్లాడుతూ గ్రామంలోని అనేక మంది నిరుపేద కుటుంబాలు సొంత ఇళ్లు లేక అద్దె ఇళ్లలో నివసిస్తూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి పేద కుటుంబానికి 3 సెంట్ల ఇంటి స్థలం కేటాయించి గృహ నిర్మాణానికి అవసరమైన గృహాలు కూడా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు నరసింహులు, మధు, గౌస్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో చట్టం సెక్షన్ 30 అమలు

**ముద్దనూరు, జూన్ 01 (ప్రభాతవార్త):**



జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు ఉత్తర్వుల మేరకు ముద్దనూరు మండల పరిధిలో 2026 జూన్ 1వ తేదీ నుండి జూన్ 30వ తేదీ వరకు పోలీస్ చట్టం సెక్షన్30 అమలులో ఉంటుందని. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నగేష్‌బాబు తెలిపారు. మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత దృష్ట్యా ఈ ఉత్తర్వులు అమలులోకి వచ్చాయన్నారు. ఈ కాలంలో బహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపులు, సమావేశాలు తదితర కార్యక్రమాలు నిర్వహించాలనుకునే వారు ముందస్తుగా పోలీసు శాఖ అనుమతి పొందాలని సూచించారు. మండలంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు సీఐ,తెలిపారు. ప్రజలు చట్ట నిబంధనలను పాటించి పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.అలాగే ఈ విషయాన్ని ప్రజలకు విస్తృతంగా తెలియజేస్తున్నామన్నారు, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని సీఐ. హెచ్చరించారు.

# ప్రమాదకర గుంతతో వాహనదారులకు ముప్పు

**ముద్దనూరు, జూన్ 01 ప్రభాతవార్త :**

ముద్దనూరు రైల్వే స్టేషన్ నుంచి ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డుకు వెళ్లే ప్రధాన రహదారిలో సిమెంట్ రోడ్డుపై ప్రమాదకరంగా గుంత ఏర్పడింది. ఈ గుంత కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంత కనిపించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నట్లు స్థానికులు తెలిపారు.ఈ రహదారిపై నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా, చాలాకాలంగా గుంత మరమ్మత్తులు చేయకుండా వదిలేశారు మరింత పెద్దదిగా మారుతూ ప్రమాదాలకు కారణమవుతోంది. ఇప్పటికే పలువురు వాహనదారులు అదుపుతప్పి గాయపడిన ఘటనలు చోటుచేసుకున్నాయని ప్రజలు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గుంతను పూడ్చివేసి రహదారిని మరమ్మతు చేయాలని, ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని వాహనదారులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ సమస్యను అధికారులు అత్యవసరంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



## ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

**రామసముద్రం జూన్ 1 ప్రభాతవార్త**

మండలంలోని చెంబకూరు మేజర్ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి రెడ్డి శేఖర్, పిహెచ్‌సి స్టాఫ్ టి. వి రమణ ఆధ్వర్యంలో కార్మికులచే పారిశుద్ధ్య పనులు చేపట్టారు, సోమవారం పాఠశాల రోడ్డులోని మార్కెట్ వద్ద కాలువలను శుభ్రం చేయడం, చెత్తను తొలగించడం పనులు చేసి కాలువలు వద్ద దోమలు ప్రబలకుండా ఉండేందుకు బ్లీచింగ్ పౌడర్ చల్లడం జరిగింది. గ్రామంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను అధికారులు పర్యవేక్షించారు. పంచాయతీ సెక్రటరీ రెడ్డిశేఖర్, రమణ ప్రజలతో మాట్లాడుతూ మన వీధి, మన గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయరాదని, ప్రతి రోజు ఉదయాన్నే కార్మికులు వచ్చి చెత్త సేకరించడాని వస్తారని ఆ వాహనంలో వేయాలని వారికి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పంచాయతీ సెక్రటరీ రెడ్డి శేఖర్, పి హెచ్ సి రమణ, ఎంపిహెచ్‌వో కుతిజ, కార్మికులు పాల్గొన్నారు.

## డివిజన్ ట్రాన్స్కో ఈఈగా షేక్ చాంద్ బాషా

**ప్రొద్దుటూరు అర్బన్ , జూన్ 1, ప్రభాతవార్త**



చిత్తూరు డిపిఈ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేసిన షేక్ చాంద్ బాషా బదిలీపై ప్రొద్దుటూరు డివిజన్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా సోమవారం ఆయన అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన ప్రొద్దుటూరులో ఏడిఈగా మూడు సంవత్సరాలపాటు సేవలు అందించి, వివిధ అభివృద్ధి పనుల నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. సాంకేతిక పనుల పర్యవేక్షణలో ఆయనకు మంచి అనుభవం ఉందని సహచరులు పేర్కొన్నారు. ఇటీవల ప్రొద్దుటూరు పవర్ హౌస్ కార్యాలయంలో ఈఈ గా2 పనిచేసిన రమణారెడ్డి పదవీ విరమణ చేయడంతో ఆ స్థానంలో చాంద్ బాషా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శాఖ సిబ్బంది, ఇంజినీరింగ్ వర్గాలు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. తన సేవలను మరింత సమర్థవంతంగా కొనసాగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

## 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు త్వరలో ఓపీఎస్ అమలు : ఒంటేరు శ్రీనివాసులు రెడ్డి

**ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 1, ప్రభాతవార్త**

2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు సంబంధించిన ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్) అంశం త్వరలో సానుకూల దిశలో పరిష్కారమవుతుందని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఉపాధ్యాయ సేవా కేంద్రంలో 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల ఓపీఎస్ సమస్యపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్‌టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులు డాక్టర్ టి.డి. వరుణ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులను కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) నుండి తొలగించి ఓపీఎస్ పరిధిలోకి తీసుకు రావాలనే డిమాండ్‌పై ప్రభుత్వం స్థాయిలో చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇప్పటికే ఈ అంశంపై పురోగతి సాధించ బడిందని, త్వరలోనే అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశ ముందని ఆయన పేర్కొన్నారు. దీంతో ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం దిశగా కీలక ముందడుగు పడుతుందని తెలిపారు. డాక్టర్ టి.డి. వరుణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల ఓపీఎస్ ఫైలు త్వరలోనే ఆమోదం పొందుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల న్యాయమైన హక్కుల సాధనపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో 2003 డీఎస్సీ ఓపీఎస్ పోరాట కమిటీ నాయకులు రిజ్వాన్ అలీ, సుధాకర్, రవి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై ఓపీఎస్ సాధనపై తమ ఐక్యతను ప్రదర్శించారు.



మాట్లాడుతున్న ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి

## అధికారుల నిరక్ష్యం కారణంగా
# మృతి చెందుతున్న ఆవులు



**వేంపల్లి జూన్ 01 ప్రభాతవార్త**

వేంపల్లి పట్టణంలోని పంచాయతీ అధికారుల నిరక్ష్యం కారణంగా ఆవులు మృతి చెందుతున్నాయని భాజపా జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ఆవరణంలో ప్లాస్టిక్ వ్యర్థాలు తిని మృతిచెందిన ఆవుకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఇరవై ఆవులు మృతి చెందాయని పలుమార్లు పంచాయతీ అధికారులకు విజ్ఞప్తి చేసిన పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ట్రాఫిక్కు అంతరాయంగా ఉన్నాయి వాటిని గోశాలలకు తరలించాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా కాలయాపన చేస్తున్నారని అన్నారు.గోవులలో సమస్త దేవతలు నిక్షిప్తమై ఉన్నాయని ధర్మ శాస్త్రాలు చెబుతున్నాయని అన్నారు. హిందువులు దేవతలకు ప్రతిరూపాలుగా ఆవులను ఆరాధిస్తారని అటువంటి ఆవుల విషయంలో హిందువుల మనోభావాలను గౌరవించకుండా వాటి మృతికి కారణం అవుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని అన్నా అన్నారు. ప్రజల వద్ద ముక్కు పిండి పన్నులు వసూలు చేయడం లో ఉన్న శ్రద్ధ ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలమీద లేదని అన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గౌస్, వృషబాచలేశ్వర దేవస్థానం పాలకమండలి సభ్యులు సుబ్రహ్మణ్యం విశ్రాంత పశువైద్యాధికారి నక్కా రాజారామ్ పంచాయతీ సానటరీ ఇన్స్పెక్టర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధుల పాలిట వరం సామాజిక పింఛన్లు



**ప్రొద్దుటూరు జూన్ 1 ప్రభాతవార్త**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ఒకేసారి 3వేల రూపాయల నుండి 4వేల రూపాయలకు పెంచిన సామాజిక పింఛన్లు వృద్ధులకు ఒక వరమనే 26వ వార్డు టిడిపి ఇన్చార్జ్ తలారి రమేష్ స్పష్టం చేశారు. సోమవారం 26వ వార్డులో సామాజిక పింఛన్లను టిడిపి నాయకులు డీలర్ కాచన శ్రీనివాసరెడ్డి తో కలిసి వృద్ధులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు సామాజిక పింఛన్ల విషయంలో ప్రతినెల 1వ తేదీ తెల్లవారుజామునుండే పంపిణీ చేయడం అబినందనీయం అన్నారు. దీనివల్ల వృద్ధులు వితంతువులు వికలాంగులకు లబ్ధి చేకూరుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డి నేతృత్వంలో టిడిపి యువ నాయకులు నంద్యాల కొండారెడ్డి ఆదేశాల మేరకు తమ చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మేలును గమనించి ప్రజలు మరోసారి కూటమిని ఆశీర్వదించాలని వారు ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో 26 వార్డు టిడిపి నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

## ఎస్సీ విద్యార్థులకు
# రీయింబర్స్‌మెంట్ తల్లికి వందనం

**ఎడ్యుకేషన్ జూన్ 1 ప్రభాతవార్త :**

2026, 27 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందుతున్న షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం"తల్లికి వందనం" పథకం కింద ఆర్థిక సహాయం అందించనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి సరస్వతి తెలిపారు. అదేవిధంగా ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరే అర్హులైన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకాల కింద మంజూరయ్యే నిధులను నేరుగా విద్యార్థుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లోనే జమ చేయనున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రస్తుతం వైఎస్సార్ కడప జిల్లాలో 4,180 మంది ఎస్సీ విద్యార్థుల బ్యాంకు ఖాతాల వివరాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.అర్హులైన విద్యార్థులు వెంటనే తమ సమీప పోస్టాఫీస్ లేదా బ్యాంకు శాఖలో వ్యక్తిగత ఖాతా ప్రారంభించి, ఆ ఖాతాను ఆధార్ నంబర్‌తో పాటు విశిది। (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) పోర్టల్‌కు అనుసంధానం చేసుకోవాలని సూచించారు. విశిది। లింక్ పూర్తయిన ఖాతాలకు మాత్రమే పథకం నిధులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జమ అవుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అవసరమైన ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి సరస్వతి వెల్లడించారు.

## నాగుల చెరువు ఆక్రమిత భూములను
# స్వాధీనం చేసుకోవాలి



**బద్వేల్, జూన్ 1, ప్రభాత వార్త**

బద్వేల్ పట్టణం పోరుమామిళ్ల బైపాస్ సమీపంలోని నాగుల చెరువు సర్వే నంబర్లు 1169, 1170లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు సోమవారం ఆర్డీవో చంద్రమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు చంద్రశేఖర్, జిల్లా కమిటీ సభ్యుడు జకరయ్య మాట్లాడుతూ చెరువు భూమిపై అక్రమంగా కంచె వేసి ఆక్రమించారని ఆరోపించారు. ఈ విషయాన్ని గతంలో రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్య పరిష్కారంలో జాప్యం జరిగిందన్నారు. విషయాన్ని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లగా మండల సర్వేయర్‌ను వివరణ కోరిన ఆర్డీవో చంద్రమోహన్, నిరక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే రెండో నోటీసు జారీ చేసి రీసర్వే నిర్వహించి ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకోవడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో లిబరేషన్ పార్టీ నాయకులు విజయరావు, నారాయణ, గంటా మహబూబ్ బాషా, రమణ, శాంసన్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ



**సిద్ధవటం జూన్ 1 ప్రభాతవార్త**

ఏపీ ప్రభుత్వం రాష్ట్ర ఖజానా లోటుగా ఉన్నా ఎన్నికల్లో చెప్పిన వాగ్దానాల మేరకు ప్రతినెలా సచివాలయ ఉద్యోగులచే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఒక పండుగ వాతావరణంలో అర్హులైన పెన్షన్ లబ్ధిదారులకు ఉదయం 7 గంటలకే అందించడం ఓ చారిత్రాత్మకమని, టిడిపి ప్రభుత్వం పేదల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని టిడిపి జాతీయ ఉపాధ్యక్షుడు బాలిశెట్టి హరిప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని బొగ్గుడివారిపల్లె పంచాయతీ ఆకురోపల్లె ఎస్సీ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు సకాలంలో అందేలా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. సంక్షేమం అభివృద్ధి కూటమి ప్రభుత్వానికే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కృష్ణయ్య, వీఆర్వో రేణుక, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు చేరువలో సచివాలయం కావాలి

**నందలూరు జూన్ 1 ప్రభాతవార్త :**

భారతీయ జనతా పార్టీ రాజంపేట పార్లమెంటరీ అధ్యక్షులు సాయి లోకేష్ సూచనల మేరకు బీజేపీ నాయకుడు రాచూరి మురళీధర్ సోమవారం కడప జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. నాగిరెడ్డిపల్లి మేజర్ రూర్బన్ పంచాయతీ పరిధిలో గ్రామ సచివాలయం2ను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.ప్రస్తుతం నాగిరెడ్డిపల్లి ప్రజలకు సేవలు అందించాల్సిన గ్రామ సచివాలయం2 నందలూరు గ్రామపంచాయతీ పరిధిలో కొనసాగుతుండటంతో ప్రజలు 3 నుంచి 5 కిలోమీటర్ల దూరం ప్రయాణించి సేవలు పొందాల్సి వస్తోందని తెలిపారు. రవాణా సౌకర్యాలు పరిమితంగా ఉండటంతో ఆటో ఛార్జీల రూపంలో రూ.100 నుంచి రూ.200 వరకు ఖర్చు భరించాల్సి వస్తోందని పేర్కొన్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే స్టేషన్, కోర్టు, విద్యుత్ శాఖ కార్యాలయాలు, బ్యాంకులు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు వంటి అనేక ప్రజా సౌకర్యాలకు కేంద్రంగా ఉన్న నాగిరెడ్డిపల్లిలోనే గ్రామ సచివాలయం ఏర్పాటు చేయడం ప్రజా ప్రయోజనాలకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. ప్రజా సౌలభ్యం దృష్ట్యా ప్రస్తుతం ఉన్న సచివాలయాన్ని నాగిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని తగిన భవనానికి తరలించి అందుబాటులో ఉంచాలని కలెక్టర్‌ను కోరారు.వినతిపత్రాన్ని స్వీకరించిన అధికారులు సమస్యపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో వేపగుంట డేవిడ్ కళ్యాణ్ రాజ్, మాజీ ఎంపీటీసీ మాడపూరి శ్రీరాములు, పొంబల శివ నరసింహులు, వీరబల్లి జయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## వేంపల్లిలో బడి పండుగ ర్యాలీ




**వేంపల్లి జూన్ 01 ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న బడి పండుగ కార్యక్రమం లో భాగంగా సోమవారం పిఎస్‌హెచ్‌ఎమ్ అమ్మని, ఆధ్యారం నిరాహించారు, అందులో భాగంగా స్టాలిన్ ఇజాక్ పాల్గొని ర్యాలీ ను ప్రారంభించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి బయట పిల్లల ను అలాగే ప్రతి విద్యార్థి ఇంట్లో కాకుండా బడి లో ఉండాలని అయన సూచించారు, అడ్మిషన్స్ పై ప్రతి ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని, ఇంటింటి వెళ్లి విద్యార్థుల వివరాలు స్వీకారించి పాఠశాల లో విద్యార్థుల సంఖ్య ను పెంచాలని సూచించారు, ఈ ర్యాలీ ఎంపీపీ ఎస్ ఉర్దూ మెయిన్ స్కూల్ నుంచి బజార్ వరకు నిరహించారు, ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు వనిపెంట షకీలా,ప్రభావతి, ఫరీదా, గౌసియా, సి ఆర్ పి సూర్యకుమారి తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గున్నారు,

## ఆడపిల్లల సంరక్షణలో తల్లిదండ్రులదే కీలకపాత్ర

**తంబళ్లపల్లె జూన్ 1 ప్రభాతవార్త ః**

టీనేజీ ఆడపిల్లల సంరక్షణ విషయంలో ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు నిఘా పెంచి అప్రమత్తంగా ఉండి కీలక పాత్ర పోషించాలని ఏఎస్ఐ నజీర్ భాష సూచించారు. సోమవారం వెలుగు కార్యాలయంలో ఏపిఎం గంగాధర్ ఆధ్వర్యంలో శక్తి యాప్ పై మహిళలకు అవగాహన జరిగింది. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ మహిళలు తమ పిల్లల భద్రత కోసం శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శక్తి టీం సభ్యులు ముని కుమార్ నాయక్, శశికళ లు టీనేజీ వయసులో ఆకర్షణలకు నియంత్రించకపోతే భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలు, వాటికి సంబంధించిన కేస్టడీస్, ఇంస్టాగ్రామ్, ఫేస్బుక్, సెల్ ఫోన్లో ద్వారా జరుగుతున్న మోసాలు మరియు వాటి పట్ల అప్రమత్తత, గంజాయి, డ్రగ్స్, మాదకద్రవ్యాలు వంటి మత్తు పదార్థాలు వల్ల జరిగే దుష్ప్రభాలు, మహిళలు మరియు పిల్లల భద్రత కోసం అందుబాటులోకి వచ్చిన శక్తి యాప్ ఉపయోగాలను అవగాహన కల్పించారు.

## డీఎస్సీపై వైసీపీ విమర్శలు రాజకీయ కుట్రే

**బద్వేల్ అర్బన్, జూన్ 1 (ప్రభాతవార్త):**



మెగా డీఎస్సీ నియామకాలపై వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శలు రాజకీయ కుట్రలో భాగమేనని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి. జగదీశ్వర్ రెడ్డి ఆరోపించారు. సోమవారం బద్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క మెగా డీఎస్సీ కూడా నిర్వహించకుండా నిరుద్యోగ యువతను నిరాశపరిచారని, అయితే కూటమి అధికారంలోకి వచ్చిన అనంతరం కేవలం 148 రోజుల్లోనే 15,941 పోస్టులతో మెగా డీఎస్సీ నియామక ప్రక్రియను పూర్తి చేసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన వెంటనే డీఎస్సీ ఫైల్‌పై తొలి సంతకం చేశారని గుర్తుచేసిన ఆయన, ఇచ్చిన హామీ మేరకు భారీ స్థాయిలో ఉపాధ్యాయ నియామకాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం ఎంపికైన అభ్యర్థులు నియామక పత్రాలు పొంది పాఠశాలల్లో విధులు నిర్వహిస్తుండగా, వైసీపీ నేతలు రాజకీయ ప్రయోజనాల కోసం డీఎస్సీపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మెగా డీఎస్సీ ప్రక్రియను అడ్డుకునేందుకు పలు కోర్టు కేసులు దాఖలైనా ప్రభుత్వం చట్టబద్ధంగా, పారదర్శకంగా నియామకాలను పూర్తి చేసిందని ఆయన తెలిపారు. దేశంలోని ప్రముఖ సంస్థ టీసీఎస్ అయాన్ ద్వారా కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహించడంతో పాటు కట్టుదిట్టమైన నిఘా మధ్య పరీక్షలు జరిగాయని చెప్పారు. మెరిట్ జాబితాలు, ర్యాంకులు, రిజర్వేషన్ వివరాలు పూర్తిగా అందుబాటులో ఉంచి పారదర్శకత పాటించినప్పటికీ, వైసీపీ నేతలు నిరుద్యోగ యువత పేరుతో తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసం యువత భవిష్యత్తుతో ఆడుకోవడం మానుకోవాలని సూచించారు. వైసీపీ చేపడుతున్న ఆందోళనల వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని, రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఈ విషయాలను గమనిస్తున్నారని జగదీశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు తగిన సమాధానం ఇస్తారన్నారు.

## హోమస్‌పేటలో
# సెంటర్ పార్కింగ్ మూసివేత

**ప్రొద్దుటూరు క్రైం, జూన్ 1, ప్రభాతవార్త:**

ప్రొద్దుటూరులో ట్రాఫిక్ సమస్యల దృష్ట్యా హోమస్‌పేటలో సెంటర్ పార్కింగ్ మూసివేసినట్లు ట్రాఫిక్ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. హోమస్‌పేటకు పని నిమిత్తం వచ్చే ప్రజలు మున్సిపల్ కాంప్లెక్స్, మడూరు కాలువపై ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో పార్కింగ్ చేసుకోవాలని ఆయన ప్రజలకు తెలిపారు. తొందరలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రజలకు పార్కింగ్ ఇబ్బందులు లేకుండా చూస్తామని ఆయన తెలిపారు.

# రైతులు హిందువుల అభిప్రాయాలను తీసుకోవాలి



పుట్ట, రాముల గుడి, విద్యాలయం, ఆంజనేయ స్వామి ఆలయాలు నిర్మించి ఉన్నారు. అక్కడే దగ్గర హిందువుల ప్రధాన రహదారి పక్కన గ్రామం కూడా ఉన్నది. అధికారులు ఇవన్నీ పరిగణంలోకి తీసుకోకుండా వారి అభిప్రాయాలు స్వీకరించకుండా ఎలా ముస్లిం వర్గానికి స్మశాన వాటికకు ఇక్కడ స్థలాన్ని కేటాయిస్తారని చాలామంది వ్యవసాయదారులు ప్రజలు హిందువులు వ్యతిరేకిస్తున్నారు. ఇవన్నీ పరిగణంలోకి తీసుకొని మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ఆలోచించి అందరికీ సమతమైన నిర్ణయాన్ని తీసుకోవాలని కోరుకుంటున్నారు.

**తహసిల్దారు రాజసింహ నరేంద్ర, డీఎస్పీ రాజేంద్రప్రసాద్, సీఐ రమణారెడ్డి పరిశీలన,**

ఎమ్మెల్యే ప్రకటన నేపథ్యంలో ముస్లిం సామాజిక వర్గం జెసిబి లు ట్రాక్టర్లు తీసుకొని ఎటువంటి దారి లేకున్నా కూడా ప్రైవేట్ ల్యాండ్ లోంచి వెళ్లి అక్కడ అక్రమంగా రాళ్లు బాధడానికి వెళ్లడంతో చుట్టుపక్కల ఉన్న పటాదారుల వ్యవసాయదారులు గ్రామస్తులు అందరూ కూడా వారిని అడ్డుకోవడం జరిగింది. ఈ విషయంపై సోమవారం 01.06.26 న పోలీసు యంత్రాంగం రెవెన్యూ అధికారి రాజసింహ నరేంద్ర డివిజనల్ పోలీస్ డిఎస్పి రాజేంద్రప్రసాద్ రాజకీయ పార్టీల సమక్షంలో ఆ చుట్టూ ఉన్న గ్రామస్తులు రైతులందరితో పరిశీలించి వారితో మాట్లాడుతూ ఇక్కడ స్థలాన్ని మాత్రమే పరిశీలిస్తున్నట్టు చెప్పడం జరిగింది. దీని కేటాయించడం అంటే పూర్తిస్థాయిలో హక్కు కల్పించినట్లు కాదు మైదుకూరు ఎమ్మార్వో, డివిజనల్ అధికారి ఆర్డీవో దృష్టికి, జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లిన తర్వాత మాత్రమే పూర్తిస్థాయి ఉత్వర్లు వచ్చిన తరువాతే ఏవైనా జరుగుతాయని డిఎస్పి, ఎమ్మార్వో , సూచించారు. ఆ విధంగా ఇకపై ఎవరు కూడా ప్రైవేట్ వ్యక్తులు ఇక్కడ అధికారులు దృష్టికి రాకుండా ఎవరి సమక్షంలో మీటింగ్ జరగకుండా ఈ స్థలంలో నిర్మాణాలు చేపట్ట డానికి వీలులేదని చెప్పి సదరు సిఐ, ఎమ్మార్వోకి చాలా గట్టిగా సూచించారు.

బద్వేల్‌లో వరుస చోరీలు:

# క్రైమ్ బ్రాంచ్ అధికారుల ముమ్మర తనిఖీలు





**బద్వేల్ అర్బన్, జూన్ 01 (ప్రభాతవార్త):**
బద్వేల్ పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన వరుస చోరీల సంఘటనలు స్థానికంగా తీవ్ర కలకలం రేపాయి. పట్టణంలోని శివ రామకృష్ణ నగర్, నెల్లూరు రోడ్డులోని సిఐటి ( సిఈఏటి) టైర్స్ దుకాణం, మైదుకూరు రోడ్ కరెంట్ ఆఫీస్ ఎదురుగా ఎంసీ ఫర్నిచర్ షోరూమ్‌లలో దొంగలు పక్కా ప్రణాళికతో పగలు,రాత్రి సమయాల్లో చోరీలకు తెగబడ్డారు. బద్వేల్ అర్బన్ పోలీసుల సమాచారం మేరకు విషయం తెలుసుకున్న కడప జిల్లా క్రైమ్ బ్రాంచ్ ఏఎస్ఐ శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ లు సోమవారం బద్వేల్ పట్టణానికి చేరుకున్నారు. స్థానిక అర్బన్ పోలీసులతో కలిసి వారు చోరీ జరిగిన మూడు ప్రదేశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఆనవాళ్లు దొరకకుండా శివరామకృష్ణ నగర్‌లోని ఓ ఇంట్లో భారీగా నగదు, బంగారం అపహరణకు గురవ్వగా.. ఎంసీ ఫర్నిచర్, సిఐటి టైర్స్ షాపుల్లో షట్టర్ల తాళాలు పగలగొట్టి దొంగలు లోపలికి చొరబడ్డారు. పోలీసులకు ఎలాంటి క్లూస్ దొరకకూడదనే ఉద్దేశంతో దుండగులు ముందస్తుగా సిసి కెమెరాల కేబుల్స్ కట్ చేయడమే కాకుండా, వాటికి సంబంధించిన డీవీఆర్ బాక్సులను కూడా ఎత్తుకెళ్లడం గమనార్హం. క్రైమ్ బ్రాంచ్ అధికారులు క్లూస్ టీమ్ సహాయంతో ఘటనా స్థలాల్లో వేలిముద్రలను సేకరిస్తమన్నారు.ఈ మూడు చోరీలు ఒకే గ్యాంగ్ చేసిందా? లేదా వేర్వేరు వ్యక్తుల పనా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. పట్టణం నడిబొడ్డున 24 గంటల వ్యవధిలో ఇలా వరుస చోరీలు జరగడంతో వ్యాపారస్థులు, ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని క్రైమ్ బ్రాంచ్ అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరూ ఈనెల 12 నుంచి పెన్షన్లకు దరఖాస్తులు చేసుకోవచ్చు



కుర్నూతల గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు లబ్ధిదారులకు అందజేస్తున్న రెడ్డయ్య యాదవ్ పోలిరెడ్డి సుబ్బారెడ్డి

**లక్కిరెడ్డిపల్లి జూన్ 01 ప్రభాతవార్త**
అర్హులైన ప్రతి ఒక్కరూ జూన్ 12వ తేదీ నుంచి పెన్షన్ కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని మండల టిడిపి అధ్యక్షుడు యనమల మదనమోహన్ రాష్ట్ర విశాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఎర్రగొళ్ల రెడ్డయ్య లు పేర్కొన్నారు సోమవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని పెన్షన్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలోనూ పర్యటించి అరకులేని ప్రతి ఒక్కరికి పెన్షన్ కోసం దరఖాస్తులు చేయిస్తామన్నారు అర్హులైన వృద్ధులు వికలాంగులు వితంతువులు పెన్షన్లు దరఖాస్తులు చేయించి పెన్షన్లు వచ్చేటట్టు చూస్తా ఉన్నారు ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ డైరెక్టర్ పోలిరెడ్డి సుబ్బారెడ్డి మైనార్టీ జనరల్ సెక్రెటరీ షేక్ ఆరిఫ్ బీసీ సంఘం నాయకులు విజయభాస్కర్ పటాన్ సాదుల్లా జై కే రెడ్డి రవి ఆచారి తదితరులు పాల్గొన్నారు

## ఆటపాటలతో అంగన్వాడి విద్య

వాల్మీకిపురం, జూన్ 1 ప్రభాతవార్త : ఆటపాటలు, పౌష్టికాహారం, పిల్లలకు భద్రతతో కూడిన విద్య అంగన్వాడిలతోనే సాధ్యమని సీడీపీవో భారతి అన్నారు. సోమవారం స్థానిక తోటవీధిలో అంగన్వాడి విద్య ఆటలపాటల విద్య అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీడీపీవో మాట్లాడుతూ మూడేళ్లు నిండిన ప్రతి చిన్నారిని అంగన్వాడి బడిలో చేర్పించాలన్నారు. పిల్లలకు భద్రతతో పాటు పౌష్టికాహారం, ఆటలపాటలకు చిరునామాగా మన ఏపీ అంగన్వాడీలు ఉన్నాయని, తల్లిదండ్రులు వీటిని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పట్టణంలోని పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి, అంగన్వాడీలలోనే పిల్లలను చేర్పిద్దామని నినదించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు రోషిణి, భానులక్ష్మి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

## తంబళ్లపల్లె ఐటిఐ జాబ్ మేళా
# 100 ఉద్యోగ అవకాశాలు

ప్రిన్సిపల్ నాగరాజు



**తంబళ్లపల్లె జూన్ 1 ప్రభాతవార్త ః**
తంబళ్లపల్లె లోని శ్రీ.టి.ఎన్.వెంకట సుబ్బారెడ్డి మెమోరియల్ ఐటిఐ లో సోమవారం జరిగిన జాబ్ మేళాలో ఎన్నడూ లేని విధంగా వందశాతం నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు పొందడం హర్షనీయమని ప్రిన్సిపాల్ నాగరాజు కొనియాడారు. ఉదయం ప్రిన్సిపాల్ నాగరాజు ఆధ్వర్యంలో శ్రీజ తిరుపతి పాలడైరీ, అమర్ రాజా, వీ టి ఎస్ బెంగళూరు, యుఎన్ఓ మైన్ బెంగళూరు, ఎల్ అండ్ టి కాంచీపురం, సాయి ఎంటర్ప్రైజెస్ బెంగళూరు కంపెనీలకు చెందిన ప్రతినిధులు 58 మంది నిరుద్యోగులను వారి ప్రతిభను పరీక్షించి 58 మంది ని 100 ఎంపిక చేసుకొని నియామక పత్రాలను ప్రిన్సిపాల్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పించిన కంపెనీ యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలుపుతూ ఉద్యోగ అవకాశాలు పొందిన నిరుద్యోగులు అంకితభావంతో ఉద్యోగాలలో చేరి ఆర్థిక అభివృద్ధి సాధన తో పాటు తంబళ్లపల్లె ఐటిఐ కి మంచి పేరు తేవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులు మాట్లాడుతూ తంబళ్లపల్లె ప్రాంతంలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాల కోసం నిస్వార్థంగా ఐటిఐ స్థాపించిన టి.ఎన్ కుటుంబ సభ్యులకు జీవితాంతం రుణపడి ఉంటామని అదేవిధంగా ప్రిన్సిపల్ మరియు అధ్యాపక బృందం, ఉద్యోగ అవకాశాలు కల్పించిన కంపెనీ యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ జాబ్ మేళాలో శ్రీజ పాల డైరీ ఏరియా మేనేజర్ కృష్ణప్ప తోపాటు ప్రతినిధులు, ఐటిఐ అధ్యాపకులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

## మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ విజయవంతం



కలికిరిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న చంద్రకుమార్‌రెడ్డి

**కలికిరి, జూన్ 1, ప్రభాతవార్త:**
మండలంలోని 14 గ్రామ పంచాయతీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఎంపీడీవో భానుమూర్తిరావు పర్యవేక్షణలో విజయవంతం అయ్యింది. సోమవారం ఉదయం కార్యదర్శి, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ ఇంటింటికి వెళ్లి పింఛన్లు లబ్ధిదారులకు అందజేశారు. పల్లఒలు పంచాయతీలో తెదేపా అధ్యక్షులు షాబుద్దీన్, కలికిరి మేజర్ పంచాయతీలో సహకార బ్యాంక్ ఛైర్మన్ నల్లారి చంద్రకుమార్‌రెడ్డి, గిరిజన కాలనీలో మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాసవర్మ, ఇందిరా నగర్‌లో తెదేపా ఎస్సీ సెల్ యువ నాయకులు బావాజీ, చెరువుముందరపల్లిలో టీడీపీ మైనార్టీ నాయకులు మునాఫ్ పలువురు నాయకులు పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి నుండి తంబళ్లపల్లెలో పారిశుద్ధ్య పనులు బంద్



**తంబళ్లపల్లె జూన్ 1 ప్రభాతవార్త ః**
తంబళ్లపల్లె నియోజకవర్గ కేంద్రం లో నేటి నుండి పారిశుద్ధ్య పనులు నిలిపివేస్తున్నట్లు కార్మికులు అధికారులకు తెగేసి చెప్పారు. గత మూడు మాసాలుగా పరిమితికి మించి పారిశుద్ధ్య పనులు చేస్తున్నా కార్మికులకు నేడు రేపు అంటూ వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు గతవారం జీతాలు చెల్లించాలని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. దీంతో ముందస్తుగా జీతాలు చెల్లించకపోతే పనులు ఆపేస్తామని హెచ్చరించినా అధికారులు పెడచెవిన పెట్టారు. ఉదయం కార్మికులు ఎంపీడీవో ఎంపీ ప్రసాద్ తో జీతాల విషయమై వేడుకోగా ఆయన జీతాల చెల్లింపుకు డిజిటల్ సమస్యలు ఎదురవుతున్నట్లు చెప్పడంతో వారు పస్తులతో పారిశుద్ధ్య పనులు చేయలేమని కరాకండిగా చెప్పి వెళ్లిపోయారు. పంచాయతీలో నిధులు ఉన్నా ఆరుగాలం కష్టపడే కార్మికుల జీతాలు చెల్లించకపోవడంపై స్థానిక ప్రజల సైతం అధికారుల తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి వారికి జీతాలు చెల్లించకపోతే తంబళ్లపల్లె స్వచ్ఛ్ ఆంధ్ర దేవుడెరుగు కంపు కొట్టడం ఖాయం.

## ఆడపిల్లల సంరక్షణలో తల్లిదండ్రులదే కీలకపాత్ర: ఏఎస్ఐ నజీర్ భాష



**తంబళ్లపల్లె జూన్ 1 ప్రభాతవార్త ః**
టీనేజీ ఆడపిల్లల సంరక్షణ విషయంలో ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు నిఘా పెంచి అప్రమత్తంగా ఉండి కీలక పాత్ర పోషించాలని ఏఎస్ఐ నజీర్ భాష సూచించారు. సోమవారం వెలుగు కార్యాలయంలో ఏపిఎం గంగాధర్ ఆధ్వర్యంలో శక్తి యాప్ పై మహిళలకు అవగాహన జరిగింది. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ మహిళలు తమ పిల్లల భద్రత కోసం శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శక్తి టీం సభ్యులు ముని కుమార్ నాయక్, శశికళ లు టీనేజీ వయసులో ఆకర్షణలకు నియంత్రించకపోతే భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలు, వాటికి సంబంధించిన కేస్టడీస్, ఇన్స్టాగ్రామ్, ఫేస్బుక్, సెల్ ఫోన్లో ద్వారా జరుగుతున్న మోసాలు మరియు వాటి పట్ల అప్రమత్తత, గంజాయి, డ్రగ్స్, మాదకద్రవ్యాలు వంటి మత్తు పదార్థాలు వల్ల జరిగే దుష్ప్రభాలు, మహిళలు మరియు పిల్లల భద్రత కోసం అందుబాటులోకి వచ్చిన శక్తి యాప్ ఉపయోగాలను మహిళలకు అవగాహన కల్పించారు. అత్యవసర సహాయం కోసం 1930,112,1098 టోల్ ఫ్రీ నెంబర్లను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్ ప్రెసిడెంట్ రామలక్ష్మమ్మ, టిడిపి మండల అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, పురుషోత్తం, నరసింహులు, రామచంద్రారెడ్డి,దండు వారి పల్లి రమణ, నారాయణ, సిసిలు కత్తి నరసింహులు, రమణ, ఆదిలక్ష్మి, పోలీసులు, మహిళలు పాల్గొన్నారు.

## 5 మంది జూదరులు అరెస్ట్

**దువ్వూరు, జూన్ 01, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని మదిరేపల్లి గ్రామంలో సోమవారం జూదం ఆడుతుండగా 5 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుండి 7150 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ధనుంజయుడు తెలిపారు. ముందుగా రాబడిన సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించామన్నారు. వీరిని త్వరలో మైదుకూరు కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు పేర్కొన్నారు.

## చౌడేశ్వరి దేవాలయం భూముల ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు



**గాలివీడు, జూన్01, .ప్రభాతవార్త.**
మండలపరిధి గోరాన్‌చెర్వు గ్రామపంచాయతీ పరిధిలోని ఆవులశెట్టివారిపల్లె శ్రీ చౌడేశ్వరీ అమ్మవారి దేవస్థాన భూముల ఆక్రమణపై గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టర్, ఎస్పీలకు వినతిపత్రం సమర్పించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో కొంతకాలంగా భూములకు సంబంధించిన వివాదాలు తీవ్ర స్థాయికి చేరుకుని రైతులు, గ్రామ ప్రజలు, భక్తులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానానికి చెందిన విలువైన భూములపై వివాదాలు నెలకొనడం వల్ల భక్తుల్లో ఆందోళన పెరిగిందన్నారు.గ్రామ ప్రజల ఫిర్యాదుల ప్రకారం స్థానికంగా ఉన్న కొందరు దురుద్దేశంతో అమ్మవారి భూముల ఆక్రమణకు తెగబడ్డారని ఆరోపించారు. వివాదాస్పద పత్రాలు, అనుమానాస్పద భూ లావాదేవీలు, బెదిరింపులు, ఒత్తిళ్ల ద్వారా భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భూ రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, వివాదాస్పద లావాదేవీలు, సంబంధిత పోలీసు రికార్డులను సమగ్రంగా పరిశీలించాలని కోరారు. అలాగే రైతులు, గ్రామ ప్రజలు, బాధితుల వాంగ్మూలాలను నమోదు చేసి, శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థాన భూముల హక్కులు, రికార్డులు, ప్రస్తుత పరిస్థితిపై విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.ఈకార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అసాధారణ ప్రతిభకు దేశ అత్యున్నత బాల పురస్కారం

ప్రధానమంత్రి బాల పురస్కార్-2026కు దరఖాస్తులు ఆహ్వానం: మడితాటి నరసింహారెడ్డి



రాయచోటి జూన్ 1 ప్రభాతవార్త అసాధారణ ప్రతిభకు దేశ అత్యున్నత బాల పురస్కారం ప్రధానమంత్రి బాల పురస్కార్-2026కు దరఖాస్తులను సమర్పించాలని అన్నమయ్య జిల్లా స్కౌట్స్, గైడ్స్, రోవర్స్, రేంజర్స్ యూనిట్లకు జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి పిలుపు నిచ్చారు. సోమవారం ఉదయం ఆయన రాయచోటిలోని స్కౌట్ కార్యాలయంలో మాట్లాడుతూ భారత ప్రభుత్వ మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రతిష్ఠాత్మకంగా అందజేస్తున్న ప్రధాన్ మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ 2026 కొరకు నామినేషన్లు ఆహ్వానించబడుతున్నా యన్నారు. ధైర్యసాహసాలు, సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ, క్రీడలు, కళలు మరియు సంస్కృతి, విజ్ఞాన శాస్త్రం, సాంకేతికత వంటి రంగాలలో విశిష్ట ప్రతిభ కనబరిచిన పిల్లలకు ఈ అవార్డు ప్రదానం చేయబడుతుందన్నారు. 31 జూలై 2026 నాటికి 18 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన బాలబాలికలు ఈ పురస్కారానికి అర్హులన్నారు. ఆన్‌లైన్ నామినేషన్ ప్రక్రియ 01 ఏప్రిల్ 2026 నుండి ప్రారంభమైందని దరఖాస్తులను 31 జూలై 2026 లోగా రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ (awards.gov.in) ద్వారా సమర్పించాలన్నారు. అన్నమయ్య జిల్లాలోని అన్ని స్కౌట్స్, గైడ్స్, రోవర్స్ మరియు రేంజర్స్ యూనిట్లు తమ పరిధిలో ప్రతిభావంతులైన విద్యార్థుల వివరాలను సేకరించి అవసరమైన ధ్రువపత్రాలు మరియు ఆధారాలతో నామినేషన్లను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని కోరారు.ఈ పురస్కా రం దేశంలోనే బాలల కోసం అత్యున్నత గౌరవ పురస్కారంగా గుర్తింపు పొందిందని, ఎంపికైన వారికి భారత రాష్ట్రపతి చేతుల మీదుగా సత్కారం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. నామినేషన్లకు సంబంధించిన పూర్తి వివరాల కోసం భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ అన్నమయ్య జిల్లా అసోసియేషన్ కార్యాలయాన్ని లేదా జిల్లా కార్యదర్శిని సంప్రదించవచ్చని తెలిపారు.

## బదిలీపై వెళ్లిన ఆర్డీవోకు ఘనసత్కారం



ఆర్డీవో ఎ. శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న అధికారులు

**పీలేరు, జూన్ 2 ప్రభాతవార్త:**
పీలేరు ఆర్డీవోగా పని చేస్తూ బదిలీ అయిన ఎ. శ్రీనివాస్ కు ఘన సత్కారం లభించింది. పీలేరు ఇన్చార్జి ఆర్డీవోగా ఉన్న ఎ. శ్రీనివాస్ బదిలీపై రాయచోటికి వెళ్లారు. ఆయన స్థానంలో హంద్రీనీవా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వి.ఎన్. నారాయణరెడ్డిని ఇన్చార్జి ఆర్డీవోగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఎ. శ్రీనివాస్ ను పూల మాలలు, దుశ్శాలువతో అధికారులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం. శివకుమార్, ఆర్డీవో ఏవో సురేష్బాబు, డీటీలు ప్రసాద్. కమలాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## కృషి విజ్ఞాన కేంద్రంలో కేత్ బచావో అభియాన్ కార్యక్రమం



**కలికిరి, జూన్ 1, ప్రభాతవార్త:**
కలికిరి కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ మరియు భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి సూచనల మేరకు పొలాల సంరక్షణపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కేవీకే సమన్వయకర్త డా.కె.మంజుల మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుంచి 30 వరకు నేల సంరక్షణకు రైతులు పాటించాల్సిన వివిధ పద్ధతులపై అవగాహన కార్యక్రమాలు కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా అన్నమయ్య మరియు చిత్తూరు జిల్లాలో వివిధ మండలాల్లోని గ్రామాలలో అవగాహన మరియు శిక్షణ కార్యక్రమాల ద్వారా నిర్వహిస్తామని తెలిపారు. రైతులు పంటలు వేసే ముందు పచ్చి రొట్టె ఎరువులైన జనుము, జీలుగ, పిల్లిపెసర వంటి పచ్చి రొట్టె పంటలను పెంచి దుక్కిలో కలియ దున్నాలని తెలిపారు. దీనివల్ల ఎకరాకు 25 శాతం నుంచి 30 శాతం రసాయన ఎరువులను తగ్గించవచ్చని తెలిపారు. నేలలో సేంద్రియ కర్బనం పెరిగి నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హార్సిలీహిల్స్ అటవీశాఖ శిక్షణ అధికారి శివకుమార్, సీడ్ బాల్స్ తయారీ మరియు ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. బీడు భూములు, కొండ ప్రాంతాలలో పచ్చదనం పెంచడానికి సీడ్ బాల్స్ అద్భుతమైన పద్ధతిని తెలిపారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకం, వానపాముల ఎరువు మరియు పశువుల ఎరువు వివిధ పంటల్లో ఏ విధంగా వాడాలని కేవీ శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి వ్యవసాయ కళాశాల అధ్యాపకురాలు నాగమణి, కేవీకే శాస్త్రవేత్తలు, ఫారెస్ట్ బీట్ అధికారి ఆదినారాయణ, ఇతర కేవీకే సిబ్బంది, వివిధ మండలాల నుంచి వచ్చిన 15 మంది రైతులు, తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## సాంఘిక సంక్షేమ శాఖ ఉత్తర్వులను అమలు చేయాలి

**పీలేరు జూన్ 1 ప్రభాతవార్త:**
అంబేద్కర్ భవనం కొరకు సర్వే నెం1414 గల ప్రభుత్వ భూమిపై డిసెంబర్ 29 న జిల్లా సాంఘిక సంక్షేమశాఖ సాధికారిత అధికారి కార్యాలయ ఉత్తర్వులను అమలు చేయాలని నేడు అన్నమయ్య జిల్లా మదనపల్లి కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నందు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ గారికి ఉత్తర్వుల కాఫీతో కూడిన వినతి పత్రాన్ని మాలమహా నాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ భవనం కొరకు అన్నమయ్య జిల్లా పీలేరు మండలం దొడ్డిపల్లి పంచాయతీ సర్వే నెం : 1414 లో(1.6.00 సెంట్ల) గల ప్రభుత్వ భూమిలో కేటాయించాలని అదేవిధంగా గూడరేవుపల్లి పంచాయతీ సర్వే నెంబర్ 198లో అంబేద్కర్ భవనానికి కేటాయించిన భూమిని రద్దు చేసి ప్రజా ప్రయోజనార్థం అనువైన చోట భూమిని కేటాయించాలని డిసెంబర్ 24 2025 వ తేదిన అన్నమయ్య జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సాధికారిత అధికారి సి.దామోదర్ రెడ్డికి వివిధ సంఘాల నాయకుల అభిప్రాయాలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించగా స్పందించిన అన్నమయ్య జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ శాధికారిత అధికారి డిసెంబర్ 29వ తేదిన పీలేరు తహసీల్దార్ కార్యాలయానికి ఉత్తర్వులు జారిచేసి నేటికీ 5నెలలు కావస్తుందని ఇకనైనా పీలేరు రెవిన్యూ శాఖ అధికారులు సాంఘిక సంక్షేమ శాఖ నుంచి అందిన ఉత్తర్వులపై విచారణ జరిపి సమగ్ర నివేదికను జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ శాధికారిత అధికారికి అందించే విదంగా ఆదేశాలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ గారిని కోరినట్టు తెలిపారు

## బాధ్యత, సేవా కార్యక్రమాలతో ముందుకెళ్తున్నాం



ప్రత్యేక ప్రతిభావంతుడికి పింఛను పంపిణీ చేస్తున్న రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ

**వాల్మీకిపురం, జూన్ 1 ప్రభాతవార్త:**
మానవసేవయే మాధవసేవ అని, ప్రభుత్వం తరుపున పంపిణీ చేసే భరోసా పింఛన్ల పంపిణీని బాధ్యతతో, సేవా కార్యక్రమంగా బావించి ముందుకెళ్తున్నామని రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకట్రమణ అన్నారు. సోమవారం మండలంలోని జర్రావారిపల్లెలో ప్రత్యేకప్రతిభావంతుల ఇండ్లవద్దకు వెళ్లి ఆయన ప్రభుత్వం పంపిణీ చేసే పింఛన్లును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తరుపున పింఛన్లు ఇవ్వడం తమకు ఎంతో బాధ్యతను, ఆత్మసంతృప్తిని కలిగిస్తుందన్నారు. వృద్ధులకు, రోగులకు, ప్రత్యేకప్రతిభావంతుల వద్దకు వెళ్లి పింఛన్లు ఇవ్వడం బాధ్యతగా, మానవసేవగా బావిస్తున్నామని, ఈ కార్యక్రమం తమకు ఎంతో ఆత్మసంతృప్తిని కలిగిస్తుందన్నారు. యువత కూడా సేవా కార్యక్రమాల పట్ల ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు దేపాని ప్రభాకర్, తెదేపా నాయకులు రామకృష్ణ, వెంకట్రమణ, హరినాథ్, ప్రసాద్ బాబు, కృష్ణ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రాజంపేట మున్సిపాలిటీలో కార్మికుల సంఖ్య పెంచాలి

**రాజంపేట, జూన్ 1 ప్రభాతవార్త**

రాజంపేట మున్సిపాలిటీలో 2017లో ఎంతమంది కార్మికులు ఉన్నారో నేటికీ అంతేమంది కార్మికులతో పనిచేస్తున్నారు. అప్పుడు జనాభా కు తగ్గట్లుగా నియమించారు. 2026 సంవత్సరం దాదాపు 80 వేల పైచిలుకు జనాభా ఉన్న మున్సిపాలిటీలో 72 కార్మికులతో ఎలా పట్టణం పరిశుభ్రం అవుతుందని మున్సిపల్ కమిషనర్ కు కార్మిక సంఘం నాయకులు వివరించారు. జనాభా తగ్గట్టు కార్మికులను నియమిస్తే కార్మికులకు పని భారం తగ్గి మెరుగైన పారిశుధ్యం లభిస్తుందని స్పష్టం చేశారు. గతంలో కూడా పలువురు మున్సిపల్ కమిషనర్లకు ఈ సమస్య వివరించి,వినతి పత్రాలు ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారి యంత్రాంగం, పాలకవర్గం స్పందించి ప్రజల అవసరాలకు తగిన విధంగా పట్టణం క్లీన్ జరిగేందుకు పారిశుధ్య కార్మికులను అదనంగా పెంచాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేల్ రవికుమార్ డిమాండ్ చేశారు. కనీసం కొంతమంది కార్మికులు కొంతమంది రిటైర్ అయ్యారు. కొంతమంది చనిపోయారు. కనీసం వాళ్ల స్థానాలైనా భర్తీ చేస్తే ఈ సమస్య కొద్దిగా పరిష్కారం అవుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పివి రమణ, లక్ష్మీదేవి, కె. ప్రసాదు, ఎం రమణ పాల్గొన్నారు.



కమిషనర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

## విద్యా, ఉపాధి అవకాశాలు పొందాలి

**దువ్వూరు, జూన్ 01, ప్రభాతవార్త:**



ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు పార్టీ కార్యకర్తలు మహాజన్ సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్ ఆధ్వర్యంలో 40 రోజుల పాటు పల్లె బాట కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కృష్ణంపల్లె గ్రామంలో మాదిగలకు చదువు గురించి వివరించారు. చదువుకుంటే మాదిగ పిల్లలకు మంచి భవిష్యత్తు అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే మధ్యలో చదువు మానేసి కూలి పనులకు వెళ్తున్న వారిని గుర్తించి వారికి చదువు యొక్క విశిష్టతను గురించి తెలియజేశారు. మాదిగ జాతి చదువుకుంటే ఎంతో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పిచ్చయ్య, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## జేఈఈ అడ్వాన్స్‌లో 28వ ర్యాంకు

**సిద్ధవటం,జూన్ 1 ప్రభాతవార్త**



జేఈఈ అడ్వాన్స్డ్2026 ఫలితాల్లో సిద్ధవటం చెందిన ముక్కర సాకేత్ అఖిల భారత స్థాయిలో 28వ ర్యాంకు సాధించారు .సాకేత్ తన ప్రాథమిక మరియు ఉన్నత పాఠశాల విద్యను శ్రీ భారతి హై స్కూల్, సిద్ధవటంలో అభ్యసించాడు. చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, పట్టుదల, లక్ష్యసాధన పట్ల అంకితభావంతో చదువులో రాణిస్తూ ఈ అత్యున్నత విజయాన్ని సాధించాడు.సాకేత్ తల్లిదండ్రులు వంతాటిపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ ముక్కర వెంకట సుబ్బారెడ్డి మరియు ముక్కర నిర్మలాదేవి తన విజయానికి ప్రధాన ప్రేరణగా నిలిచారని తెలిపాడు. వారి నిరంతర ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, స్వీయ కృషి వల్లే ఈ స్థాయి ఫలితాన్ని సాధించగలిగానని పేర్కొన్నాడు. శ్రీ భారతి హైస్కూల్ యాజమాన్యం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రముఖులు సాకేత్‌ను అభినందించారు. భవిష్యత్తులో ప్రతిష్ఠాత్మక ఐఐటీలో ప్రవేశం పొంది సాంకేతిక రంగంలో విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రతినిధి డాక్టర్ ముక్కర వెంకటసుబ్బారెడ్డి తెలిపారు.

## సురభి లో మలేరియా మొహోత్సవాలు



**వేంపల్లి జూన్ 01 ప్రభాతవార్త**

మలేరియా మాసోత్సవాలా సందర్భంగా సురభి పీహెచ్ సి పరిధిలోని గాజులపేట గ్రామములో డాక్టర్ శివప్రసాద్ ఆధ్వర్యంలో ర్యాలీ నీప్రహించి, మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పించితిమి. మలేరియా, ఆడ అనాఫిలిస్ దోమ కుట్టుట ద్వారా ఒకరి నుంచి,ఒకరికి వ్యాపిస్తుంది అని, చలి జ్వరము, తలనొప్పి దీని లక్షణాలు, అని, ఒక్కక్కసారి మలేరియా మెదడుకు సోకి, ప్రాణాపాయం కూడా కలుగ వచ్చుని, కావున దోమలు కుట్టకుండా, దోమలు పుట్టకుండా జాగ్రత్తలు తీసుకోలాని వరుసకాలమంతా ఇంటి పరిసరాలు , పరిశుభ్రంగా ఉంచుకోవాలని నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని డడాక్టర్ శివప్రసాద్, తెలియజేసారు. ఈకార్యక్రమములోడాక్టర్ సోదర నాయక్ ,సబ్ యూనిట్ ఆఫీసర్స్ ప్రసాద్, ఎంపీహెచ్ఈఓ రామకృష్ణ,హెల్త్ సూపెర్వైజర్, రవణమ్మ, ఎంపీహెచ్ఏ వెంగయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# టౌన్ బ్యాంకు లాభాల్లోనే కొనసాగుతుంది

### ఖాతాదారులు ఆందోళన చెందవద్దు : చైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి

**ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 1 ప్రభాతవార్త**

ప్రొద్దుటూరు కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లాభాల్లోనే కొనసాగుతుందని ఖాతాదారులు ఆందోళన చెందవద్దని బ్యాంకు ఛైర్మన్ బొగ్గుల వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. బ్యాంకు ఆర్థిక పరిస్థితిపై స్పష్టత ఇచ్చేందుకు సోమవారం బ్యాంకులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకు ఆర్బీఐ మార్గదర్శకాలు, సహకార శాఖ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించబడుతోందని, ఖాతాదారుల డిపాజిట్లకు ఎలాంటి ప్రమాదం లేదని తెలిపారు. అవసరమైన సమయంలో ఖాతాదారులు తమ డిపాజిట్లను పొందగలరని, రూ.5 లక్షల వరకు డిపాజిట్ ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా అందుబాటులో ఉందన్నారు. బ్యాంకు గురించి నిరాధార ఆరోపణలు చేయడం వల్ల ఖాతాదారుల్లో అనవసర భయాందోళనలు ఏర్పడతాయని, తప్పుడు ప్రచారంపై అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రుణాల వసూళ్ల విషయంలో బ్యాంకు పూర్తిగా నిబంధనల ప్రకారమే వ్యవహరిస్తోందని ఆయన వివరించారు. నిర్ణీత గడువులో రుణాలు చెల్లించని వారికి వడ్డీతో పాటు అదనపు ఛార్జీలు విధించాల్సి వస్తుందని చెప్పారు. పలుమార్లు నోటీసులు ఇచ్చిన తర్వాత కూడా స్పందన లేకుంటే సహకార చట్టం ప్రకారం తదుపరి చర్యలు చేపట్టే అవకాశం ఉంటుందని వెల్లడించారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ లో వార్షిక సమావేశం నిర్వహించి, వార్షిక నివేదిక విడుదల చేస్తామని ఎవరైనా పరిశీలించవచ్చని తెలిపారు. మాజీ ఛైర్మన్ ఎల్లాల కుమార్ రెడ్డి మాట్లాడుతూ రుణాల మంజూరులో బ్యాంకు అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తోందన్నారు. ఆదాయ వివరాలు, న్యాయపరమైన అంశాలు, ఆస్తి విలువ తదితరాలను పరిశీలించిన తర్వాతే రుణాలు మంజూరు చేస్తామని చెప్పారు. బ్యాంకుకు ప్రస్తుతం రూ.78 కోట్ల డిపాజిట్లు, రూ.55 కోట్ల రుణాల పోర్ట్‌ఫోలియో ఉండగా, ఎన్‌పీఏ కేవలం 0.03 శాతమే ఉందని వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు దాదాపు రూ.1.35 కోట్ల లాభాలను నమోదు చేసిందని తెలిపారు. శతాబ్దానికి చేరువైన చరిత్ర కలిగిన ఈ బ్యాంకులో రుణాల ఎగవేత కారణంగా చాలా అరుదుగా మాత్రమే ఆస్తుల వేలం జరిగిందన్నారు. బ్యాంకు కార్యకలాపాలపై శాఖాపరమైన, ఆర్బీఐ తనిఖీలు నిరంతరం జరుగుతుండటంతో ఖాతాదారులు ఎలాంటి అపోహలకు లోనుకావద్దని కోరారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్ అక్రమ్, డైరెక్టర్లు రాంభూపాల్ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, సురేంద్రనాథ రెడ్డి, ఓబుళరెడ్డి గంగాధర్, నంద రామయ్య, ఆడిటర్ నాగేంద్ర పాల్గొన్నారు.



బ్యాంకు వార్షిక నివేదికతో టౌన్ బ్యాంకు చైర్మన్, డైరెక్టర్లు

## సీఐను కలిసిన కుప్పాల



**సిద్ధవటం జూన్ 1 ప్రభాతవార్త**

ఒంటిమిట్ట పోలీస్ స్టేషన్‌లో సీఐ వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి సత్కరించిన ఏపీ పంచాయతీ రాజ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య పలు స్థానిక సమస్యలు, ప్రజా భద్రతకు సంబంధించిన అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మాట్లాడుతూ గ్రామాల్లో శాంతియుత వాతావరణం కొనసాగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. యువత చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.ప్రజల భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నారని, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కృష్ణయ్య, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రమశక్తి అవార్డు గ్రహీతకు సన్మానం



**ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 1, ప్రభాతవార్త**

ప్రొద్దుటూరు టిఎన్టియుసి కడప జిల్లా అధ్యక్షుడు చింతకుంట కుతుబుద్దీన్ కు రాష్ట్ర ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి శ్రమశక్తి అవార్డును అందించారు. ఈ సందర్భంగా 25వ వార్డు టిడిపి ఇన్చార్జ్ నూరి వారి మిత్రబృందము కలిసి కుతుబుద్దీన్ ను సోమవారం ఆయన కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా నూరి మాట్లాడుతూ చాలా కాలం నుంచి కార్మిక రంగంలో పనిచేస్తూ కార్మికుల సంక్షేమ కార్మికుల అభివృద్ధి గురించి పాటుపడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మైనారిటీ నాయకులు సీఎస్ ఇస్మాయిల్, పీవీ మగ్బుల్, మున్నా, నాగరాజు, హర్ష వర్ధన్, చౌసెన్, షకీల్, రామారావు, సురేష్,కమాల్, షేక్ షా పాల్గొన్నారు.

# మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం

**ప్రొద్దుటూరు క్రైం, జూన్ 1, ప్రభాతవార్త:**

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు ఉప పోలీసు అధికారి (ఏఎస్పీ) పర్యవేక్షణలో ప్రొద్దుటూరు 2వ పట్టణ పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో సోమవారం కొర్రపాడు రోడ్డులోని కేసీ పుల్లయ్య స్కిల్ ఫౌండేషన్ సెంటర్‌లో మహిళల భద్రత మంరియు రక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినిలు, మహిళలు, సిబ్బందికి మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డయల్ 100, సేవల వినియోగం, పోక్సో చట్టం, సైబర్ నేరాలు వాటి నివారణ, సోషల్ మీడియా భద్రత, అలాగే మహిళల రక్షణ కోసం రూపొందించిన శక్తి యాప్ వినియోగంపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టుటౌన్ ఇన్‌స్పెక్టర్ పి.వంశీనాథ్ మాట్లాడుతూ మహిళలు, బాలికలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, ఎటువంటి వేధింపులు లేదా నేర సంఘటనలు ఎదురైనా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. అలాగే సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అనుమానాస్పద ఫోన్ కాల్స్, లింకులు, మెసేజ్‌లకు స్పందించరాదన్నారు. సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మహబూబ్ బాషా మాట్లాడుతూ శక్తి యాప్ ప్రయోజనాలు, మహిళల భద్రతకు అందుబాటులో ఉన్న హెల్ప్‌లైన్ సేవలు మరియు పోక్సో చట్టం కింద బాలల రక్షణకు సంబంధించిన నిబంధనలను వివరించారు. ప్రజల్లో మహిళల భద్రతపై మరింత అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహించడం జరుగుతుందని పోలీసు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేసీ పుల్లయ్య ఫౌండేషన్ మేనేజర్ మరియు ప్రిన్సిపల్ గురు బ్రహ్మయ్య, ప్రొద్దుటూరు మహిళా పీఎస్ సిబ్బంది, శక్తి టీం, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



## సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**దువ్వూరు, జూన్ 01, ప్రభాతవార్త:**

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే వివిధ రకాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసిల్దార్ సంజీవరెడ్డి, ఎంపీడీవో సుబ్బారెడ్డిలు అన్నారు. సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, ప్రజలు, గ్రామస్థుల నుండి వినతి పత్రాలు స్వీకరించారు. ఇటీవల కురిసిన వర్షాలతో అక్కడక్కడ రోడ్లు దెబ్బతిన్నాయని, రోడ్లు మరమ్మతులు చేయాలని అలాగే రీ సర్వేలో భూములు తక్కువగా నమోదు అయ్యాయని వాటిని సరిచేయాలని కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు పంపుతామని, వారు నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈలు శివకుమార్, సుబ్రహ్మణ్యం, ఏపీఓ లక్ష్మీనారాయణ, మండల వ్యవసాయ అధికారి అమర్‌నాథ్‌రెడ్డి, పశు వైద్య అధికారి ఫణీంద్రరెడ్డిలు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి ఆచూకీ కోసం పోలీసుల విజ్ఞప్తి

**నందలూరు, జూన్ 1 ప్రభాతవార్త:**



మండలంలోని రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ)పై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం జరిగిన ఈ ఘటనలో సుమారు 60 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి తలకు తీవ్ర గాయాలు కావడంతో మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు.మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదని, అతని ఎడమ చేతిపై"వెంకటసుబ్బయ్య" అనే పేరు, అలాగే శివుని బొమ్మ పచ్చబొట్టు ఉన్నట్లు ఎస్సై వెల్లడించారు. మృతుడి బంధువులు లేదా పరిచయస్తులు ఎవరైనా గుర్తించినట్లయితే వెంటనే పోలీసులను సంప్రదించాలని కోరారు. ఈ మేరకు నందలూరు ఎస్సై 9121100583, ఒంటిమిట్ట సర్కిల్ సీఐ 9121100581 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్సై మల్లికార్జునరెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రజలు సహకరించి మృతుడి ఆచూకీ గుర్తించేందుకు తోడ్పడాలని కోరారు.

## రత్నం హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు విద్యా బోధనా మెలకువలపై శిక్షణ







**బద్వేల్ అర్బన్, జూన్ 01 (ప్రభాతవార్త):**

స్థానిక రత్నం ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఉపాధ్యాయుల బోధనా మెలకువలను పెంపొందించేందుకు సోమవారం ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు. కాలానుకూలంగా బోధనా పద్ధతులను మెరుగుపరుచుకుంటూ, ఆధునిక విద్యా ప్రమాణాలను పాటిస్తూ, విద్యార్థులలో సృజనాత్మకతను, నైతిక విలువలను పెంపొందించే లక్ష్యంతో నూతన బోధనా విధానాలపై ఈ శిక్షణ ఇచ్చారు. పాఠశాల కరస్పాండెంట్ రత్నం, డైరెక్టర్ శ్రీనాథ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణా తరగతులకు హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ మోటివేషనల్ స్పీకర్, ట్రైనర్ శ్రీమతి కృష్ణ జ్యోతి ముఖ్య అతిథిగా విచ్చేసి ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థుల మానసిక స్థాయిని బట్టి బోధన సాగించాలని, పరీక్షలు నిర్వహిస్తూ విలువలతో కూడిన విద్యాబోధన చేయడానికి అవసరమైన ఉత్తమ పద్ధతులను, సాంకేతిక మెలకువలను ఆమె వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ రత్నం మాట్లాడుతూ, ఉపాధ్యాయులు ఎంతో ఉత్సాహంతో ఈ శిక్షణా తరగతులను ఉపయోగించుకున్నారని కొనియాడారు. రాబోయే కాలంలో విద్యార్థుల మానసిక స్థితిగతులకు అనుగుణంగా చక్కటి విద్యాబోధన అందిస్తారని ఆకాంక్షించారు. అనంతరం శిక్షకురాలు కృష్ణ జ్యోతిని పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ శిక్షణ ద్వారా ఎన్నో విలువైన, సాంకేతిక బోధనా అంశాలను తెలుసుకున్నామని ఉపాధ్యాయులు తెలిపారు. కాలానుకూలంగా తమ బోధనా విధానాన్ని మార్చుకుని, విద్యార్థుల స్థాయికి తగినట్లుగా ఉన్నతమైన బోధన అందించడానికి ఈ తరగతులు తమకెంతో ఉపయోగపడతాయని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బయ్య, ఉపాధ్యాయులు సరోజమ్మ, జయమ్మ, కల్పన, బ్యూలా, హరిత, అనూష, ప్రణతి, జిలాని, రజియా, నాగ సుబ్బమ్మ, హరికృష్ణ, నాగరాజు, మల్లికార్జున, శివ, అలాగే శ్రీ సృజన్ హైస్కూల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### అలిరెడ్డిపల్లె బ్రిడ్జి వద్ద స్మశాన వాటికకు

# స్థలం కేటాయించవద్దు ..

### తహశీల్దారుకు రైతులు వినతిపత్రం

**వేంపల్లె జూన్ 01 ప్రభాతవార్త**

వేంపల్లె పాపాగ్ని నదిలోని అలిరెడ్డిపల్లె బ్రిడ్జి వద్ద ఆర్యవైశ్యల కొరకు శవదహన ఘాట్ ను ఏర్పాటు చేయవద్దని రైతులు కోరారు. సోమవారం స్థానిక రెవిన్యూ కార్యాలయంలో తాహసిల్దారు మోహన్ కృష్ణకు అలిరెడ్డి పల్లె, తూపల్లె, ఎగువ తూపల్లె గ్రామాలకు చెందిన రైతులు, నాయకులు స్మశాన వాటిక కోసం స్థలం కేటాయించవద్దని వినతి పత్రం అందజేశారు. పాపాగ్ని నదిలోని అలిరెడ్డిపల్లె బ్రిడ్జి వద్ద ఆర్యవైశ్యల కొరకు శవ దహన ఘాట్‌ను ఏర్పాటు చేసేందుకు స్థల సేకరణ జరుగుతున్నట్లు తెలిసిందని తెలిపారు. బ్రిడ్జి వద్ద శవ దహన ఘాట్ ఏర్పాటు చేస్తే మూడు గ్రామాల ప్రజలకు, అ ప్రాంతంలో పంటలు సాగు చేసే రైతులకు, ఎద్దుల కొండపైకి వెళ్లే భక్తులకు చాలా ఇబ్బందికరంగా ఉంటుందని తెలిపారు. వేంపల్లె నుండి మూడు గ్రామాలకు వెళ్లేందుకు అ రహదారి తప్పా ఇతర రహదారి లేదని తెలిపారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా అలిరెడ్డిపల్లె, తూపల్లె, ఎగువ తూపల్లె గ్రామాల ప్రజలతో పాటు రైతులు, విద్యార్థులు కూడ అ రహదారి వెంట తిరుగుతుంటారని తెలిపారు. అలిరెడ్డిపల్లె రహదారిలోని బ్రిడ్జి వద్ద శవ దహన ఘాట్ ఏర్పాటు చేస్తే రహదారిలో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, మహిళలు భయబ్రాంతులకు గురి అయ్యే అవకాశం ఉందని తాహసిల్దారు దృష్టికి తెచ్చారు. ఎద్దుల కొండపై ఎడాది ఒక్కసారి ఉత్సవాలు జరుగుతాయని అ సమయంలో అన్నదాన కార్యక్రమాలు కూడ భక్తుల కొరకు అ స్థలంలో ఏర్పాటు చేసేందుకు వీలు ఉంటుందని తెలిపారు. పండించిన పంటలను నూర్పిడి చేసుకొనేందుకు అస్థలం రైతులకు అండగా ఉంటుందని తెలిపారు. కాబట్టి ప్రజలను, రైతులను, విద్యార్థులను, భక్తులను దృష్టిలో పెట్టుకొని బ్రిడ్జి వద్ద శవ దహన ఘాట్ కొరకు స్థలం కేటాయించకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. దీంతో స్పందించిన తాహసిల్దారు మోహన్ కృష్ణ ఇంకా ఆర్యవైశ్యల కొరకు తాము శవదహన ఘాట్ కు స్థలం కేటాయించలేదని తెలిపారు. ప్రజలకు, రైతులకు ఇబ్బందులు కలగకుండా స్థలం కేటాయిస్తామని తాహసిల్దారు రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు చంద్రశేఖర్ రెడ్డి, రామ కృష్ణారెడ్డి, నాగ సుబ్బారెడ్డి, వెంకటనారాయణ రెడ్డిలతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.



### ప్రతి నెల ఒకటవ తేదీన

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ

**కలసపాడు, జూన్ 1 ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకం ఏర్పాటుచేసిన సామా జిక ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమాలా ఎప్పటికప్పుడు నిర్వహిస్తూ పేద బడుగు బలహీనవర్గాల వారికి టిడిపి నియోకవర్గ నేత మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజక వర్గ ఇంచార్జ్ యువనేత కొణిరెడ్డి రితీష్ కుమార్ రెడ్డిల ఆదేశాల మేరకు సోమవారం కలసపాడు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ జరిగింది. కార్యక్రమంలో గత ప్రభుత్వం కంటే టిడిపి ప్రభుత్వం ముందంజలో ఉందని కలసపాడు గ్రామ కమిటీ ఛైర్మన్ యువ నాయకుడు బుసికే శ్రావణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సామాజిక పెన్షన్ల పంపిణీ కార్య క్రమం సచివాలయ సిబ్బంది పాల్గొని లబ్దిదా రులకు అందరికీ అందుబాటు ఉండి వారికి పంపిణీ చేయాల్సిన పెన్షన్ పరిశీ లించారు. లబ్దిదారులకు గ్రామ ప్రజలు వృద్ధులు, వికలాంగులు, పెన్షన్ దారు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అక్కివారివల్లె కలసపాడు గ్రామాలా అన్నివర్గాల వారికి అండగా టిడిపి నేతలు అందుబాటులో ఉండి అర్హులై వారికి ప్రభుత్వ పథకాలను పొందేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, సచివాలయ సిబ్బంది పెన్షన్ దారులు పాల్గొన్నారు.



# అధికార పార్టీ నాయకుల గొప్పలు,,పట్టణం నిండ దిబ్బలు

**వేంపల్లె: జూన్ 01 ప్రభాతవార్త**

స్థానిక పట్టణంలోని పలు వీధుల్లో కాలువల్లో చెత్త చెదారం నిండిపోయి మురికి నీరు రోడ్లపై నిలిచాయి అందులోనే పందుల సహజీవనం చేస్తున్నాయి. తాగునీటి వాలు గుంతలు మురికి గుంతలుగా మారాయని చెడువాసనతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారని ఆమ్‌ఆద్మీపార్టీ కడప జిల్లా కోఆర్డినేటర్ రహంతుల్లా అధికారుల పాలకుల నిరక్ష్యంపై ధ్వజమెత్తారు. ఈసందర్భంగా ఆమ్‌ఆద్మీపార్టీ జిల్లాకోఆర్డినేటర్ రహమతుల్లా జిల్లాకో కన్వీనర్ దాదాపీర్ లు మాట్లాడుతూ ప్రజాసమస్యలు అంగుళం దాటుకున్న అధికారుల పాలకుల మాటలు ఆకాశానికి తాగే విధంగా ఉన్నాయని రహమతుల్లా అన్నారు. 11వ వార్డు 12వార్డు 10వార్డు 13వార్డు ఇలా ఊరు నిండా ఇవే సమస్యలు ఉన్నాయి సిబ్బందిని ఒత్తిడి చేస్తే మాకు జీతాలు రాలేదు ఇవ్వలేదు మేము ఎలా పని చేయాలని ప్రజల్ని సూటిగా అంటారు. ప్రజల నుంచి సేకరిస్తున్న పన్నుల డబ్బులు ప్రజాధనం ఎవరి జేబులో వెళ్తుందని కూడా సంబంధిత అధికారులు ప్రజలకు సమాధానం ఇవ్వాలి అన్నారు. గతవైసిపిపాలనలోనూ ఇలానే వ్యవహరించారు, ఇప్పటి టిడిపి కూటమి ప్రభుత్వంలోనూ ఇలానే వ్యవహరిస్తున్నారు. మరి ఇక్కడ మార్పు ఎక్కడ జరిగిందని కూడా మేము ఆమ్‌ఆద్మీపార్టీ తరపున వేంపల్లె పట్టణ ప్రజలతరపున సూటిగా ఇటుపాలక ప్రభుత్వాన్ని అటు వ్యవస్థపరమైన అధికారులను సూటిగా ప్రశ్నిస్తున్నాం మీకు ప్రజల సమస్యల పట్ల చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఈపారిశుద్ధం పై చర్యలు తీసుకొని మెరుగైన పాలన అందియాలని ప్రభుత్వ యంత్రాంగాన్ని డిమాండ్ చేస్తున్నాం అన్నారు. ఈకార్యక్రమంలో ఆప్ మండల సభ్యులు పీరు బాషా.ఎస్ ఎమ్ డి గౌస్. షఫీ భాయ్. షేక్ష భాయ్. తదితరులు పాలొగొన్నారు.



## బిజెపి యువ మోర్చా అధ్యక్షునికి ఘనంగా స్వాగతం పలికిన నవీన్

**యర్రగుంట్ల జూన్ 1 ప్రభాతవార్త**

రాష్ట్ర యువమోర్చా అధ్యక్షులు సునీల్ కుమార్ రెడ్డి పర్యటనలో భాగంగా కడప జిల్లా బిజెపి కార్యాలయానికి సోమవారం విచ్చేసిన ఆయనను బీసీ నాయకుడు చిలంకూర్ బిజెపిఎంపీటీసీ నవీన్ కుమార్ ఘనంగా స్వాగతం పలికారు అనంతరం సునీల్ కుమార్ రెడ్డికి మర్యాదపూర్వకంగా శాలువాతో సత్కరించి బొకే అందజేశారు ఈ సందర్భంగా బిజెపి యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కడప జిల్లాకు వచ్చినందుకు ఆనందంగా ఉందని తెలిపారు అనంతరం చిలంకూర్ బిజెపి ఎంపీటీసీ బీసీ యువ నాయకుడు నవీన్ కుమార్ తో ఆయన రానున్న స్థానిక సంస్థల గురించి కులగనన సర్వేల గురించి అడిగి తెలుసుకున్నట్టు పార్టీ శ్రేణులు తెలిపారు ఈ కార్యక్రమంలో యువమోర్చా జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున జోనల్ ఇంచార్జ్ సుబ్బరాజు తదితర బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు

